17 నుంచి తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై గిరి రైతులకు అందించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. ఆయన మాట్లాడుతూ, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నేషనల్ బోర్డు వారి సౌజన్యంతో అల్లూరి సీతారామ రాజు జిల్లాకు చెందిన రైతులకు ఈనెల 17 నుండి 24 వరకు 7 రోజుల పాటు 25 మంది రైతులకు శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ కల్పించబడునని తెలిపారు. ఉత్సాహవంతమైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. ఆసక్తి కలిగిన రైతులు తమ పరిశోధన స్థానంలో వారి ఆధార్ కార్డుతో పేర్లు నమోదు చేసుకోవలసినదిగా సూచించారు. ఇతర వివరాలకు సేద్య విభాగం శాస్త్రవేత్త బి.ఎస్. సందీప్ నాయక్ ఫోన్: 9885112564) ను సంప్రదించాల్సిందిగా కోరారు.

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

-1/70 చట్టం అమలుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి - ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పార్లమెంట్ సమావేశంలో తెలంగాణ బీజేపి ఎంపి డికె అరుణ బోయవాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చాలని వ్యాఖ్యానించడాన్ని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర తీవ్రంగా ఖండించారు. బుధవారం అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బోయవాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చి ఆదివాసీలకు అన్యాయం చేయవద్దని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చాలని శ్యామల ఆనంద్ కమిషన్ వేసిందని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ పార్టీ కూడా బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చాలని ఆమోదించిందని దీన్ని ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా వ్యతిరేకించిందని తెలిపారు. ప్రస్తుతం బోయవాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. బోయవాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చేందుకు ఇప్పుడు ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం కూడా గతంలో కారం శివాజీ నాయకత్వంలో కమిషన్ వేసి అసెంబ్లీలో తీర్మానించిందన్నారు. బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చేందుకు కేంద్రంలో ఉన్న బిజెపి, రాష్ట్ర తెలుగుదేశం, ప్రతిపక్ష వైసిపి పార్టీలు ఒకే విధాన ధోరణిలో వెళు_న్నాయని విమర్శించారు. ఏపీ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరులకు ఇల్లులు మంజూరు చేయాలని వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరులకు ఇల్లులు మంజూరు చేయడమంటే 1/70 చట్టానికి తూట్లు పొడవడమే అవుతుందని తెలిపారు. షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు ఇల్లులు మంజూరు చేయవద్దని తెలిపారు. 1/70 చట్టం ఉండగా షెడ్యూల్ ప్రాంతంలో గిరిజ నేతరులకు ఇల్లులు ఎలా మంజూరు చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 1/70చట్టాన్ని సవరించాలని రాష్ట్ర అసెంబ్లీ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటన వెనక 1/70 చట్టం తొలగింపు కుట్రలో భాగంగానే రంపచోడరం ఎమ్మెల్యే అసెంబ్లీ సాక్షిగా గిరిజనేతరులకు ఇల్లు మంజూరు చేయాలని వ్యాఖ్యానించారని, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియల శిరీష చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో గిరిజనులు పోరాటానికి సన్నద్ధం అవుతారని హెచ్చరించారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం 1/70 చట్టం రక్షణకు అసెంబ్లీ సమావేశంలో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల నాయకులు కె జగన్నాథం, కె బుజ్జి బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

మాట్లాడుతున్న సిఇఒ

చింతపల్లిలో సిఇఒ పర్యటన

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి ఆకస్మికంగా సుడిగాలి పర్యటన చేశారు. తొలత మండల పరిషత్ కార్యాలయం సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావుతో కలిసి చింతపల్లి-1 సచివాలయం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు బడుగు బలహీన ప్రజలకు చేరాలంటే పీ4, సిటిజన్ సర్వేలను చేయాలన్నారు.జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని మరమ్మతు పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆయన అన్నారు. గూనలంక వీధి, సాయి బాబా ఆలయం తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జెఈ బాలకిషోర్, నీటిపారుదల శాఖ ఏఈ జి.స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, పలువురు అధికారులు ఆయన వెంట ఉన్నారు.

పాడేరులో 'యువత పోరు' ర్యాలీ

ప్రజాశక్తి -పాడేరు: ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బుధవారం నిర్వహించిన యువత పోరు కార్యక్రమంలో భాగంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ఐటిడిఏ మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. పాడేరు అరకు నియోజవర్గాల్లోని వివిధ మండలాల నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్య లింగం, మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, శెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ విధానాలతో యువత భవిష్యత్తు అంధకారంలో ఉందన్నారు. రాష్ట్రంలో 11 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ అంధక దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారని, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు అనంతరం కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అల్లూరి జిల్లా నాయకులు బత్తిరి రవిప్రసాద్, చండా సుబ్రహ్మణ్యం, సామ్యూల్ వివిధ మండలాల ఎంపీపీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న వైసిపి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని మాడగడ పంచాయతీ పకనగూడ గ్రామానికి చెందిన పూజారి లోలిత్ ఏపీ టూరిజం కార్పొరేషన్ మెన్ పవర్‌లో గత నెల 17న డ్యూటీ లో పనిస్తుండగా ఒక్కసారిగా పడిపోయి మృతి చెందాడు. దీంతో ఏపీ టూరిజం గేట్ వద్ద ఏపీ టూరిజం ఉద్యోగులు, సిఐటీయు, ఆదివాసి గిరిజన సంఘం, సిపిఎం అధ్వర్యంలో బాధి కుటుంబాన్ని ఆదుకోవాలని భారీ ఎత్తున ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం ఏపీ టూరిజం మయూరి రిసార్ట్స్ లో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి బాలదేవ్, టూరిజం వర్కర్ యూనియన్ రాష్ట్ర నాయకుడు గంగరాజు,మాడగడ మాజీ సర్పంచ్ పి అర్జున్ సమక్షంలో బాధిత కుటుంబానికి మొదటి విడతగా మేనేజర్ 2 లక్షల 12 వేలును మృతుడి భార్య కు అందజేసారు. మిగతా డబ్బులు వచ్చేనెల మొదటి వారానికి అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

నగదును అందజేస్తున్న అధికారులు, నాయకులు

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఎండాకాలంలో ఏజెన్సీ ప్రజలకు తాగునీటికి చర్యలు చేపట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని మండలాల ఎంపిడిఒలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులు, గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ గ్రామాల్లో బోరుబావులు, వాటర్ ట్యాంకులు, మోటార్లు, వాటర్ పైపులు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వాటిని తక్షణమే బాగు చేయించాలని అధికారులకు సూచించారు. గ్రామాలలో ఉన్న వాటర్ ట్యాంకులు క్లీన్ చేయించాలన్నారు. ప్రతి మండలంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. జల్ జీవన్ మిషన్ ద్వారా 2028 నాటికి ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్వాలిటీ వాటర్ సరఫరా చేసే విధంగా వాటర్ టెస్టులకు టెక్నాలజీని ఉపయోగించాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వాటర్ ట్యాంకులు ఉన్న గ్రామాల్లో అదనంగా ఒక్కొక్క మోటారు అందుబాటులో ఉంచాలని సూచించారు. పిడబ్ల్యుఎస్ స్కీముల డేటా సమర్పించాలన్నారు. గ్రామాల్లో బోర్లు మరమ్మతులు చేయించే బాధ్యత సంబంధిత ఎంపీడీవోలపై ఉందని స్పష్టం చేశారు. గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లుపై ఉందని తెలిపారు. తాగునీరు సరఫరాలో ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు యస్.శ్రీనివాసరావు దొర, శ్రీనివాస్ విశ్వనాథ్, కెఆర్ విజయ, యం.బాపన్నదొర, యాదగిరీశ్వరరావు, రత్నకుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఈలు శివ, సుబ్బారావు, ఏఈలు, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం ఏపీఈపీడీసీఎల్ ఇంజనీర్లు, పిఎయు ఇంజనీర్లు పంచాయతీరాజ్ ఇంజనీర్లు ద్వారా చేస్తున్న పనులపై ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. ఈ సమావేశంలో ఏపీఈపిడిసిఎల్ ఈఈ గాబ్రియల్, డిఈలు ఉమాశంకర్, పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

పాఠశాలలో వంటశాలను పరిశీలిస్తున్న డిఇఒ బ్రహ్మాజీరావు

కనీస అభ్యసన స్థాయి మెరుగుపర్చాలి

- డిఇఒ బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పాఠశాలల్లో కనీస అభ్యసన స్థాయిలు మెరుగుపరచాలని అల్లూరి సీతా రామరాజు పాడేరు జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో స్టాఫ్ మీటింగ్ నిర్వహించి అకడమిక్ విషయాలు చర్చించారు. పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, స్పెషల్ టెస్టులు రోజూ నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ వారితో చర్చించి, మెనూ అమలు చేయు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై డిఇఒ సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని, సమయానికి వంట చేసి భోజనం వడ్డించాలని ఆదేశించారు. అనంతరం క్లస్టర్ సమావేశానికి హాజరై క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న ప్రైమరీ ఉపాధ్యాయులతో చర్చించారు. ఉపాధ్యాయులు కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం చప్ప సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు, ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐటిడిఎ ప్రాంగణంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు

మన్యం కవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అధ్యాపకులు నూనె రమేష్ స్థానిక ఐటిడిఎ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ బుధవారం ప్రారంభించారు. ఇటువంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న నూనె రమేష్‌ను పిఒ అభినందించారు. ఈ సందర్భంగా నూనె రమేష్ మాట్లాడుతూ ఈ చలివేంద్రం ద్వారా తాగునీరు అందించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడమని, చెట్లను నరకొద్దని, ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని ప్రచారం చేయడం కూడా ముఖ్య ఉద్దేశమని చెప్పారు. విద్యార్థులలో సామాజిక స్పృహ, సామాజిక బాధ్యత పెంపొందించేలా వారిని ఈ చలివేంద్రం నిర్వహణలో భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ సిబ్బంది, విద్యార్థులు వేముల చిరంజీవి, ముర్రం సురేష్, బంధం ప్రశాంత్, రవ్వ లక్ష్మణ్, మడకం మానస, సున్నం మత్తేశ్వరి, తుష్టి రాధ, ముర్రం సుబ్బలక్ష్మి, కిలో సాయిదుర్గ, కొవ్వాసి రజిత తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి

మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సంయుక్త కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ తెలిపారు. బుధవారం జెసి చాంబర్ లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మెగా జాబ్ మేళా పోస్టర్‌ను జేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, అత్యంత ప్రతిష్ట గల సుమారు 28 సంస్థలు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొని వారికి అవసరమైన నిరుద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసి వెంటనే వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తారని తెలిపారు. 18ఏళ్ళు నిండిన పదవ తరగతి ఆ పైన ఉన్నత చదువులు చదివిన వారు జాబ్ మేళాకు హాజరై ఉపాధి పొందాలని జేసి సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు విద్య, నైపుణ్యాల ఆధారంగా రూ. 12 వేల నుండి రూ. 35 వేల వరకు వేతనం లభిస్తుందని జెసి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రోహిణి, సహాయకులు నవీన్ పాల్గొన్నారు.

గిరిజనేతరులకు గృహాల మంజూరు తగదు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం ప్రకారం గిరిజనులకు మాత్రమే భూములుపై సంపూర్ణ హక్కులు ఉంటాయన్న విషయాన్ని ఎమ్మెల్యే శిరీషా మరిచి చట్టాన్ని తూట్లు పొడిచే విధంగా మాట్లాడడం తగదని ఎపి గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ అన్నారు. గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని అసెంబ్లీలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష ప్రస్తావించడంపై స్పందిస్తూ ఆయన పాడేరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని భూములు గిరిజనేతరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించడం కానీ, హక్కులు కల్పించడం కానీ చేయకూడదన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలని హితవు పలికారు. గిరిజన చట్టాలకు విఘాతం కలకుండా గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులకు పక్కా గృహాలు ఎలా మంజూరు చేయాలో చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజనుల ప్రయోజనాలను కాపాడాల్సింది పోయి, వారి మనుగడకు విఘాతం కలిగేలా మాట్లాడడం గిరిజనలకు ద్రోహం చేయడమేనన్నారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఆదివాసీల సమస్యలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కోరారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉచిత సివిల్స్ కోచింగ్ దరఖాస్తులు స్వీకరణ గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించామని ఐటిడిఎ ఇన్చార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గిరిజన అభ్యర్థుల అభ్యర్థన మేరకు దరఖాస్తులు గడువు పొడిగించడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణను గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మిరియాలకు మద్దతు ధర ప్రకటించాలి

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

గిరిజనుల ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న గాలికొండ ఎంపిటిసి, సర్పంచ్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ : ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న మిరియాల పంటకు మద్దతు ధర ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే సురేంద్ర డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం చేపడుతున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సాగర పంచాయతీ టిక్కిలిబెడ్డలో సందర్శించి ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సురేంద్ర మాట్లాడుతూ, జన్మన్ పథకం ద్వారా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు రూ 10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ మేరకు నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తోపాటు 18 ఏళ్లు దాటిన మహిళలకు రూ 1500 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుడు లింగన్న, కె నర్సింగ్, చిన్నయ్య, శ్రీను, చిన్నయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలి : అప్పలనర్స

హుకుంపేట : మండలంలోని అడ్డుమండ, బారమసి పంచాయతీల్లో సిపిఎం ప్రజా చైతన్య యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ యాత్ర ద్వారా ప్రజల వద్దకు వెళ్లి స్వయాన వారి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడం జరుగుతుందని తెలిపారు. అడ్డుమండ, బరమసి పంచాయితీ గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఉపాధి బకాయిలు చెల్లించాలన్నారు. సన్యాసమ్మపాలెం, నిలంపుట్టు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం చిడిపుట్టు వంతెన ను పరిశీలించారు. అధికారులు స్పందించి వంతెన మరమ్మతు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హైమావతి, అప్పల కొండపడాల్, కృష్ణారావు, అప్పారావు, వి.దాసు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

బిజ్జగూడలో..

అరకులోయ రూరల్ : సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కె రామారావు బస్కి పంచాయితీ పివిటిజి గ్రామమైన బిజ్జగూడలో పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మంచినీరు, సిసి రోడ్డు, అంగన్వాడి, సామాజిక భవనం తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సోడేపల్లి ఆనంద్, సత్యారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జన్‌మన్ ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలి

సీలేరు : కేంద్ర ప్రభుత్వం పిఎం జన్‌మన్ పథకం ద్వారా మంజూరు చేసిన ఇళ్లకు నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు చొప్పున ఇవ్వాలని సిపిఎంకు చెందిన గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు, సర్పంచ్ కాకూరి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ ఆకులూరి గ్రామాన్ని బుధవారం వారు సందర్శించారు. జమన్‌మన్ పథకం కింద మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీలో ఇల్లు నిర్మించుకోవాలంటే మెటీరియల్ మైదాన ప్రాంతం నుంచి తెచ్చుకోవాల్సి ఉందన్నారు. దీని వల్ల ప్రభుత్వం ప్రస్తుతం పెంచి ఇస్తున్న రూ.3.39 లక్షలు కూడా ఏ మాత్రం సరిపోవడం లేదని, అందువల్ల యూనిటీ ధర రూ.5 లక్షలకు మంచి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మల్లేశ్వరరావు, కామేశ్వరరావు, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం గ్రామాన్ని 41 కాంటూరులో కలపాలి

కూనవరం : భీమవరం గ్రామాన్ని 41 కాంటూరులో కలపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో సిపిఎం జన చైతన్య యాత్ర బుధవారం కొనసాగింది. సిపిఎం నాయకులకు భీమవరం గ్రామస్తులు తమ గోడు వెల్లబుచ్చారు. 2022లో గోదావరి వరదలకు గ్రామంలోని అన్ని ఇళ్లు మునిగిపోయాయని, అయినా తమ గ్రామాన్ని ప్రభుత్వం, అధికారులు ఆర్ అండ్ ఆర్ గ్రామంగా గుర్తించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయ్యావారిగూడెంలో ముంపునకు గురవుతున్న భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, నాయకులు పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామ్మూర్తి, కె.సత్తిబాబు, తాళ్లూరి శ్రీనివాసరావు, మడెం బాబు, సుమన్, దేవి, కుమారి, సత్యవతి పాల్గొన్నారు.

బిజ్జగూడలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

భీమవరంలో ప్రజలకు కరపత్రాలు ఇస్తున్న సిపిఎం నేతలు

శిక్షణ ఇస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ నాయుడు

కాఫీ యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి- పాడేరు: మండలంలోని డి.గొందురూ ల్యాండ్ స్కేప్ పరిధిలో మద్దులబంధ గ్రామంలో ఆర్ వై ఎస్ ఎస్, సభల్ ప్రాజెక్టులో భాగంగా మండల స్థాయి కాఫీ యాజమాన్య పద్ధతులపై బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మార్చి, ఏప్రిల్, మే నెలలో కాఫీ తోటల్లో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు క్లుప్తంగా సభల్ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ నాయుడు రైతులకు వివరించారు. ఆర్ వై ఎస్ ఎస్ వాసన్ సంస్థల ఆధ్వర్యంలో 100 మంది ఆదర్శ రైతులను గుర్తించి కాఫీ మోడల్ ప్లాట్ లను తయారు చేయించి వారికి ప్రతి నెల యాజమాన్యం పద్ధతులపై, చీడపీడల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమాలు సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. కాఫీ, మిరియాల పంటల్లో దిగుబడి పెంచడమే ప్రధాన ధ్యేయంగా ప్రాజెక్టు కృషి చేస్తుందని ఆర్ వై ఎస్ ఎస్ ప్రతినిధి రవీంద్ర తెలియజేశారు. కాఫీలో వచ్చు కాండం తొలచు పురుగు, ఆకుమచ్చ తెగులు నివారణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో సబల్ ప్రాజెక్టు ప్రతినిధులు సత్యనారాయణ, ఆర్ వై ఎస్ ఎస్ సిబ్బంది ,కాఫీ బోర్డు లైజన్ వర్కర్లు, వివిధ గ్రామాలకు చెందిన కాఫీ రైతులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ త్రినాథ్

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- ముచంగిపుట్టు : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ ఉబెంగుల గ్రామంలో సిపిఎం సర్పంచి కొర్ర త్రినాథ్ బుధవారం రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ, రవాణా సౌకర్యం లేక కాలినడకన మండల కేంద్రానికి గ్రామస్తులు వెళ్లేందుకు ఇబ్బంది పడేవారన్నారు. ఎన్నో మార్లు గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు వినతులు సమర్పించగా స్పందించి బీచ్ రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు.సుదీర్ఘ కాలం పోరాట ఫలితమే ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వి.సాదురామ్, ఉప సర్పంచ్ ఎ.సత్యం, వార్డు సభ్యులు ఎ.అనంతరం, వి.సుబ్బరావు, పిసా కమిటీ సభ్యులు వి.నీలకంఠం, వి.సుబ్బారావు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని మారుమూల బలపం పంచాయతీలోని సుమారు రూ.5.70 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ కె.రమేష్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రహదారి నిర్మాణంతో వర్షాకాలంలో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పుతాయనానఉ. రహదారి నిర్మాణానికి సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు గ్రామస్తుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బచ్చలి మచ్చమ్మ, వార్డ్ సభ్యురాలు చిట్టీమ్మ, వైకాపా నాయకుడు బాబురావు, కూటమి నాయకులు గబులంగి అప్పారావు, నారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు త్వరలో నవోదయం

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

పిహెచ్‌సిలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు : పాడేరు మండలంలోని పలు గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ బుధవారం సుడి గాలి పర్యటన జరిపారు. గ్రామాల్లో సారా నిర్మూలన కోసం త్వరలోనే నవోదయం కార్యక్రమం చేపడతామని ఆయన మహిళలకు వెల్లడించారు. ఆయన ముందుగా అయినాడ గ్రామాన్ని సందర్శించి అక్కడ జల జీవన్ పనులను, సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. సచివాలయంలో ఎపి ఫైబర్ నెట్ సరిగా పనిచేయడం లేదని గుర్తించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలో ఎక్కువగా సారాతో మగ వారు చనిపోతున్నారని గ్రామంలోని మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా త్వరలోనే నవోదయం పేరుతో సారా నిర్మూలనకు చర్యలు తీసుకుంటామన్నారు. రాయిపాలెం గ్రామంలో సందర్శించి జల జీవన్ పనులు, రహదారి పనులు పరిశీలించిన కలెక్టర్ రహదారిని మే నెలాఖరులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. జేజేఎం కింద మంజూరైన రూ.4.50 లక్షలతో వెంటనే పైపులు కొనుగోలు చేసి నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. రహదారి నిర్మాణంలో ఫారెస్ట్ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. కొన్ని రహదారుల నిర్మాణాలలో కాంట్రాక్టర్లు మధ్యలో పనులు వదిలేసి పోతున్నారని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా కాంట్రాక్టర్ల నమోదు ఆధారంగా వారి ట్రాక్ రికార్డు డాటా తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్ అక్కడ రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసారు. ఆసుపత్రి నిర్వహణ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్త పరిచారు.మలకపాలెం బాలుర ఆశ్రమ పాటశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించారు. స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను పరిశీలించి పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, బి, డి గ్రేడులలో ఉన్న విద్యార్థులు వెనుక బడటానికి గల కారణాలతో రిజిస్టర్ నిర్వహించి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పర్యటనలో గ్రామీణ నీటి సరఫరా ఇఇ కే.జవహర్ కుమార్, హౌసింగ్ పిడి బి.బాబు, గిరిజన సంక్షేమ డిడి ఎల్.రజని, ఎఇ దుర్గా ప్రసాద్, తహసిల్దార్ త్రినాధరావు నాయుడు, ఎంపిటిసి ఎర్రయ్యమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వర రాజు, రేగం మత్స్య లింగం, మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, శెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో వివిధ మండలాల వైయస్సార్సీపి శ్రేణులు హాజరై వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గంగవరంలో కేక్ కట్‌చేస్తున్న వైసిపి కార్యకర్తలు

గంగవరం: గంగవరం మండలం నెల్లిపూడి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి నెల్లిపూడి అంబేద్కర్ సెంటర్లో వైయస్ రాజశేఖర్ రెడ్డి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి భారీ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జడ్పిటిసి బేబీ రత్నం, వైస్ ఎంపిపిలు రామ తులసి, గంగాదేవి, వైసిపి నాయకులు అప్పలరాజు, తాతపూడి ప్రకాష్, వై.వెంకటేశ్వరరావు, నెల్లిపూడి ఎంపీటీసీ కనకలక్ష్మి, మండల కో-ఆప్షన్ సభ్యులు కెవెస్ ప్రభాకర్, సర్పంచులు రమణమ్మ, మరిడమ్మ పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో వైఎస్ఆర్ విగ్రాహానికి పూలమాల వేసిన వైసిపి నాయకులు

రాజవొమ్మంగి : వైసిపి మండల అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. తొలిత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్స్ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్డింగ్ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, వైసిపి నాయకులు దాట్ల వెంకటేష్ రాజు, బొడ్డు వెంకటరమణ, నాగులపల్లి కుశరాజు, కనిగిరి దుర్గాప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, సింగిరెడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : చిన్నారులు, మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని గాయత్రి విద్యా పరిషత్ సైంటిస్ట్ డాక్టర్ శైలజ అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన 'చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు- సామాజిక మూలాలు' అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శైలజ మాట్లాడుతూ, సోషల్ మీడియా ప్రభావం యువతపై చాలా ఎక్కువగా ఉందన్నారు. ఎక్కడికక్కడ మద్యం షాపులను ఏర్పాటు చేస్తూ యువతను మద్యం మత్తులో ముంచుతున్నారని, దీని వల్ల అఘాయిత్యాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలన్నారు. పిడిఎస్ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ, అత్యంత అమానుషమైన, హేయమైన, మాటల్లో వర్ణించలేని రూపాల్లో స్త్రీలపై, చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ, దేశంలో గంటకు 47 ఘటనలు జరుగుతున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. ఇటువంటి ఘటనలు జరక్కుండా మూలాలను అరికట్టాలని కోరారు. ఉపాధ్యక్షులు ఆర్.ఆషా మాట్లాడుతూ, ఆఘాయిత్యాలకు కారణమవుతున్న మద్యం, మత్తు పదార్థాలను, పోర్న్ సైట్లు నిషేధించాలని, స్త్రీలను భోగ వస్తువుగా చూపిస్తున్న టీవీ ప్రోగ్రామ్‌లు, సినిమాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఎన్.భాస్కర్, పి.విశ్వనాథ్, రాజేష్, సతీష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ టెండర్ రద్దుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ టెండర్ రద్దు చేయాలని యునైటెడ్ డాక్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 163వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలనుద్దేశించి సత్యనారాయణ మాట్లాడుతూ, ఏటా రూ.వందల కోట్లు లాభాలను సంపాదిస్తున్న పోర్టు ఉద్యోగుల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయడం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.800 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. దాంట్లో నాలుగో వాటా ఖర్చుపెట్టినా హాస్పిటల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని నియమించవచ్చని తెలిపారు. ఇలా ఆలోచించకుండా ప్రయివేటు వారికి అప్పగించాలని ఆలోచించడం దుర్మార్గమన్నారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రయివేటీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్.త్రినాధరావు, నాయుడు, రామారావు, బి.జగన్, నర్సింగరావు, లక్ష్మణ్, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన బుధవారం పేదలు సీతమ్మధార తహశీల్దార్ ఎం.రమేష్‌కు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ఎం.పైడిరాజు, పాత్రపిల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా హామీల అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు షేక్ రహిమాన్, జిఎస్‌జె.అచ్యుతరావు, పడాల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు సేవలు పున:ప్రారంభం

ప్రజాశక్తి- మాధవధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మాధవధారలో బుధవారం పోస్టాఫీసు సేవలను పున:ప్రారంభించారు. గత కొద్దిరోజులుగా 50వ వార్డులోని పోస్టాఫీసును ఇండస్ట్రియల్ ఎస్టేట్ కు తరలించడం ప్రజలు పడుతున్న ఇబ్బందులపై వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్, బిజెపి నాయకులు కిల్లి శ్రీరామ్‌మూర్తి స్పందించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును, జిల్లా కలెక్టర్‌ను వారు పలుమార్లు కలిసి మాధవదారలో పోస్టాఫీసును ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై వారు స్పందించి శ్రీ మాధవ యువజన సమాజం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పోస్టాఫీసును సనపల వరప్రసాద్, కార్పొరేటర్ వావిలాపల్లి ప్రసాద్, పోస్టల్ సూపరింటెండెంట్ గజేంద్ర కుమార్ మీనా బుధవారం ప్రారంభించారు.

నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దాతలు

నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రామవరం పంచాయతీ పరిధి రామవరంపాడు గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇల్లు, సర్వం కోల్పోయి నిరాశ్రయులైన సోలం నరసింహారావు కుటుంబానికి కృష్ణార్జున ఫౌండేషన్ ఆధ్వర్యాన బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కాకునూరు కృష్ణార్జునరావు బాధిత కుటుంబానికి బియ్యం, కూరగాయలు, నూనె డబ్బా, సబ్బులు, బకెట్, చాప, కుర్చీ మొదలైన నిత్యవసర సరుకులు అందించారు. కార్యక్రమంలో నోముల రామారావు, నోముల శ్రీనివాసరావు, బాగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిరీషాదేవి వ్యాఖ్యలు దారుణం

ప్రజాశక్తి-రంపచోడవరం : 1/70 చట్టంపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం వేసిన బాణమే రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి అని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు జిల్లా అధ్యక్షులు తీగల బాబూరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజనేతరులకు ఏజెన్సీ ప్రాంతంలో పక్కా గృహాలు మంజూరు చేయాలని ఎపి అసెంబ్లీలో ఎమ్మెల్యే శిరీషా దేవి మాట్లాడిన తీరు, గతంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరణ చేయాలని చేసిన వ్యాఖ్యలను బలపరుస్తున్నట్లుగా ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ముల్లును ముల్లుతోనే తీయాలనే సూత్రాన్ని ఉపయోగించి గిరిజనులను గిరిజనులతోనే అణచివేయించే కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని అమలు చేయటంలో అధికారులు విఫలమవుతున్నారని, ఈ చట్టాన్ని ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులకు కూడా ఏజెన్సీలో పక్కా గృహాలను కోరడాన్ని జాతి ద్రోహంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేశారు. ఆదివాసీలకు న్యాయం చేయలేని ఎమ్మెల్యే శిరీషా దేవి ఆ పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మోడిద నూకరాజు, పీత ప్రసాద్ పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీలో యువత నిపుణులుగా మారాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యువతరం సైబర్ నేరాలను నియంత్రించే నిపుణులుగా తయారు కావాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. బుధవారం సాయంత్రం ఎయు ఇంజినీరింగ్ కళాశాల వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఎయు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఐదు రోజుల బూట్ క్యాంప్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహకారంతో ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (ఐఎస్ఇఎ) ప్రాజెక్ట్ - 3లో భాగంగా ఈ ఐదు రోజుల బూట్ క్యాంపును సైబర్ సెక్యూరిటీ, ప్రైవసీ, క్రిప్టోగ్రఫీ వెబ్ అప్లికేషన్, పెనట్రేషన్ టెస్టింగ్ అంశాలపై నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రశ్నించడం మొదలు పెడితేనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. సైబర్ దాడులు, సైబర్ నేరాలు అనేక దేశాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న విధానాన్ని వివరించారు. ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకున్న దానికి భిన్నంగా బూట్ క్యాంపులో నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని చెప్పారు. పోలీస్ శాఖ నేడు అనేక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటోందని అన్నారు. సదస్సు సమన్వయకర్త ఆచార్య వి.వల్లి కుమారి మాట్లాడుతూ ఐదు రోజుల బూట్ క్యాంపునకు 56 మంది హాజరయ్యారని, వారికి నాలుగు అంశాలపై సమస్యలను ఇచ్చి పరిష్కరించే విధంగా సన్నద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు, కంప్యూటర్ సైన్స్ విభాగ ఆచార్యులు ఆచార్య ఎం.శశి, ఆచార్య జి.లావణ్య దేవి తదితరులు మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వ్యాపారమే పరమావధిగా..!

పోర్టు స్టేడియం లీజు వ్యవహారంపై చర్చ
'టెండరు' కొంతే.. మిగతా అంతా ఆక్రమణ అంటూ విమర్శలు
లక్ష్యాలకు దూరంగా పోర్టు కళావాణి : సీనియర్ సిటిజన్ల ఆవేదన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరం నడిబొడ్డునగల పోర్టు కళావాణి స్టేడియం వద్దకు ఎవరైనా అడుగుపెడితే అవాక్కవ్వాల్సిందే. విశాఖ పోర్టు అథారిటీకి చెందిన 'కళావాణి స్టేడియం'నకు ఆ బోర్డులెక్కడా కనిపించవు. స్టేడియాన్ని పోర్టు కాంట్రాక్టర్లకు అమ్మేసిందా ? అనేలా బయట 'విశ్వనాథ్ కన్వెన్షన్' అని ఒకచోట, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ అని మరోచోట.. ఇలా బయట గేటు నుంచి లోపలకు వెళ్లేదాక ప్రైవేట్ కాంట్రాక్టరు బొడ్డేటి కాశీ విశ్వనాథ్ పేరుతోనే ప్రాంగణం అంతా కనిపించడం గమనార్హం. రాష్ట్రంలోనే ప్రభుత్వ ఆధీనంలోగల అతిపెద్ద స్టేడియం ఇది. నగర పౌరులే కాదు పోర్టు ఉద్యోగులు, అధికారులు సైతం అక్కడకు వెళ్లినా ప్రైవేట్ సెక్యూరిటీ అడ్డుకునే పరిస్థితులు నెలకొన్నాయి. స్టేడియం కనిపించదు... స్పోర్ట్స్ జరగవు. ప్రస్తుతం నడుస్తున్నదంతా వ్యాపార వినోదమే. సుమారు 15 ఎకరాల ఈ పోర్టు కళావాణి నేడు వాణిజ్య క్షేత్రమై 'టెండరు' పాడుకున్న కాంట్రాక్టరు గుప్పెట్లో విలవిల్లాడుతోంది. కేవలం ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలను ఏటా రూ.2 కోట్లకు రెండేళ్ల క్రితం లీజు పాడుకున్న కాశీ విశ్వనాథ్ తన టెండరుతో నిమిత్తం లేకుండా పోర్టు కళావాణి ప్రాంగణం అంతటినీ వినియోగించుకోవడం చర్చనీయాంశమైంది. .కొంతమంది పాత ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులను మినహాయిస్తే ఫీజు లేకుండా పోర్టు ఉద్యోగులు, కార్మికులు సైతం లోపలకు ప్రవేశించేందుకు అవకాశం లేదు. వారికి సైతం మనిషికి నెలకు రూ.1100 చెల్లించాల్సిందేనంటూ కాంట్రాక్టరు చెబుతున్నారు.

క్రీడా స్ఫూర్తికి విఘాతం

అథ్లెటిక్స్ గ్రౌండ్ రన్నింగ్ ప్రాక్టీస్‌కు ఎంతో వీలుగా ఉండడంతో స్కూలు, కాలేజీ విద్యార్థులు ఇక్కడకు రోజూ వచ్చి గతంలో ప్రాక్టీస్ చేసేవారని వాకర్స్, సీనియర్ సిటిజన్‌లు గుర్తు చేసుకుంటున్నారు. స్టేడియంలో ఒకటో, రెండో స్థలాలు కాకుండా మొత్తం పోర్టు స్టేడియం పోర్టు చేతుల నుంచి జారిపోతోందంటూ వారు 'ప్రజాశక్తి'కి తెలిపారు. పోర్టు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇదంతా జరుగుతోందని చెబుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్లను అందించిన పోర్టు స్టేడియాన్ని అధికారులు గాలికొదిలేశారని వారంతా విమర్శిస్తున్నారు. క్రీడా స్ఫూర్తికి విఘాతం కలుగుతున్నా ఉన్నతాధికారులకు పట్టడం లేదని, వారికి నెలనెలా ముడుపులు ముడుతుండటమే దీనికి కారణమని వారంతా ఆరోపిస్తున్నారు.

లీజుకు ఏమిచ్చారు ?

స్టేడియంలో ఇండోర్, అథ్లెటిక్స్ గ్రౌండ్ ప్రాంగణాలను మాత్రమే రెండేళ్ల క్రితం సుమారు రూ.2 కోట్లకు లీజుకు పోర్టు ఇచ్చింది. ఇండోర్ స్టేడియం, అవుట్‌డోర్ కలిపి ఏటా రూ.81 లక్షలు, కళావాణి ఆడిటోరియం రూ.1.2 కోట్లు మొత్తంగా రూ.2 కోట్లు టెండరు ఇది. ఈ

పోర్టు స్టేడియం వద్ద విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ పేరిట ఉన్న బోర్డులు

టెండరు పాడుకున్న నుంచీ సదరు లీజుదారు మొత్తం పోర్టు స్టేడియాన్ని పూర్తిగా వ్యాపార మయం చేశారు. చాలా వరకూ ఈ ప్రాంగణంలోని చెట్లను సదరు కాంట్రాక్టరు నరికేశారంటూ వాకర్స్ ఆరోపిస్తున్నారు. వరల్డ్ క్లాస్ స్టేడియంగా చేసేందుకుగానూ అండర్ యుటిలైజేషన్ స్థలం అంటే రాబడి లేని భూమిని మాత్రమే కాంట్రాక్టరుకు ఇవ్వాలని పోర్టు నిబంధన ఉన్నా సరే వాటన్నిటినీ పోర్టు అధికారులు తుంగలో తొక్కి కాంట్రాక్టరుకు కొమ్ముకాశారు. స్టేడియం లోపల రాజీవ్ గాంధీ ఎసి ఇండోర్ స్టేడియాన్ని పూర్తిగా లాడ్జీల మాదిరిగా అద్దెలకు ఇచ్చేశారు. ఒక మహిళ తన ఇద్దరి పిల్లలను స్విమ్మింగ్‌కు జాయిన్ చేయగా ఒక్కొక్కరికీ రూ.4 వేలు చొప్పున నెలకు కాంట్రాక్టరు వసూలు చేస్తున్నారు. రెస్టారెంట్లు, స్నో పార్కు తాజాగా ఏర్పాటు చేసి రూ.లక్షలను రోజూ ఆదాయంగా సదరు కాంట్రాక్టరు ఆర్జిస్తున్నారు. టెండరు పాడుకున్న తర్వాత మిగతా ఖాళీ స్థలాల వినియోగానికిగానూ పది శాతం పోర్టుకు ఇచ్చేలాగ టెండరు కాపీలో ప్రత్యేకంగా రాసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా రెస్టారెంట్లు, స్నో పార్కులు వంటివి ఏర్పాటు చేసిన కాంట్రాక్టరు నుంచి 40 శాతానికిపైగా వసూలు చేయకుండా 10 శాతం అనడం వెనక లొసుగు ఏమిటని పోర్టు అధికారులను పలువురు ప్రశ్నిస్తున్నారు.

బిడ్డింగ్ ప్రాసెస్‌లో కాంట్రాక్టర్‌కు వెళ్లింది : పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్

పోర్టు స్టేడియం గతంలోనే బిడ్డింగ్‌లో విశ్వనాథ్‌కు వెళ్లిందని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. పోర్టు కళావాణిని బాగా అభివృద్ధి చేయాలని ఇటీవల పోర్టు ఆడిటోరియాన్ని సందర్శించిన తర్వాత పోర్టు చైర్మన్ అంగముత్తు తమకు ఆదేశాలు జారీ చేసారని చెప్పారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు.

14న 'ఉక్కు' నిరసనలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14న తలపెట్టిన ఉక్కు నిరసన ప్రదర్శనలను విశాఖలో జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆ రోజు జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఉదయం 10 గంటలకు నిరసన ప్రదర్శన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అలాగే పాత గాజువాక జంక్షన్‌లో నిరసన చేపట్టాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్ణయం చేసినట్టు వెల్లడించారు. వీటితో పాటు అన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమల గేట్ల వద్ద, కార్మికుల పని ప్రదేశాల్లోనూ నిరసనలు తెలపాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

నమూనా పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో పాలిటెక్నిక్ నమూనా పరీక్షలు

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలంలోని పలు పాఠశాలల్లో పోలీసుల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన పాలిటెక్నిక్ మోడల్ ప్రవేశ పరీక్షకు విశేష స్పందన లభించిందని. ఈ సందర్భంగా జీకే వీధి సిఐ వరప్రసాద్ మాట్లాడుతూ జీకే వీధి, పెదవలస, దారకొండ, సీలేరు ఆశ్రమ పాఠశాలలో పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్ నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్ష పేపర్ మోడల్ ప్యాటరీన్, ఓఎంఆర్ షీట్ నింపే విధానంపై అవగాహన పెంపొందించుకోవడానికి ఈ టెస్ట్ దోహదపడుతుందని తెలిపారు. ఈ మోడల్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి పాలిటెక్నిక్ పరీక్షకు పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు అధిక శాతం మంది మోడల్ టెస్ట్‌లో పాల్గొని వారి ప్రతిభను కనబరిచారని సూచించారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్ఐ కె.రవీంద్ర, జికే వీధి ఎస్ఐ అప్పలసూరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం రింతాడ, సంకాడ సచివాలయాలను ఎంపీడీవో ఉమామహేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు తదితర అంశాలపై చర్చించారు. సచివాలయం-2లో ఇంజనీరింగ్ అసిస్టెంట్, వీఆర్వో, సూపర్వైజర్ విధులకు హాజరు కాకపోవడాన్ని గుర్తించారు. సంకాడ (ఎస్‌డబ్ల్యుపిసిలో) చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. వాటి పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో చేపట్టారు. ఇతర కేంద్రాల్లో మొక్కలు నాటేందుకు ఉచితంగా పంపిణీ చేశారు. అంగన్వాడి సెంటర్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. చిన్నారుల బాగోగులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి పాపారావు, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15న జెడ్‌పి స్థాయీ సంఘాల సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరుగనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు 2వ, 5వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 11 గంటలకు 3, 4వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 12 గంటలకు 1, 6, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులందరూ తమ శాఖల ద్వారా అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపుమేరకు బుధవారం ఉదయం ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం వద్ద విశాఖలోని బ్యాంకు అధికారులు, ఉద్యోగులు, క్లర్క్‌లు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆఫీసర్స్ యూనియన్ కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ రానున్న 24, 25వ తేదీల్లో బ్యాంకులు సమ్మెకు వెళ్తున్నాయన్నారు. ఐదు రోజుల పని దినాలు, బ్యాంకుల్లో తగిన ఉద్యోగ నియామకాలకు ఆమోదించాలని ఈ కార్యక్రమానికి దిగినట్టు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు, స్టాఫ్ యూనియన్ జాయింట్ జనరల్ సెక్రటరీ బి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.